క్లుప్తంగా

వాన కోసం రైతుల ఎదురు చూపులు


సాగుకు సిద్ధం చేసిన పొలం

దొనకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పది రోజులు కావస్తోంది. వాన ఎప్పుడు పడుతుందో.. పొలంలో విత్తనాలు ఎప్పుడు నాటాలో అని రైతన్నలు వాన కోసం ఎదురు చూస్తున్నారు. కంది, ఆముదాలు, పత్తి విత్తనాలు విత్తేందుకు దూర ప్రాంతమైన వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి ఇళ్లల్లో పెట్టుకున్నారు. పల్లెల్లో ఏ పనులు లేక చెట్ల కింద, రచ్చబండ వద్ద, దేవాలయాల వద్ద రైతన్నలు ఉదయం, సాయంత్రం ముచ్చట్లాడుకుంటున్నారు. దొనకొండ ప్రాంతం వర్షాధార పంటలు ఎక్కువ భాగం సాగు చేస్తారు. మరికొద్ది రోజులు ఇలానే ఉంటే ఖరీఫ్ సీజన్ కూడా దాటిపోతుంది. పంటలు పండకపోతే ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. నోరు లేని గేదెలకు పశుగ్రాసం, తాగు నీరు కరువైపోతుంది. ట్రాక్టర్ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.20 వేల ధర పలుకుతోంది. ఈ ఏడాది గడ్డు పరిస్థితి ఏర్పడేలా ఉందని, ఏ పంటలు పండుతాయో, ఏం తిని బతకాలో, ఎలా అప్పులు తీర్చాలో, శుభకార్యాలు ఎలా చేయాలో అంటూ రైతులు డీలా పడ్డారు. ఏ గ్రామం చూసినా, ఏ రైతన్నను పలకరించినా కాలం సరిగా లేదంటూ దిగాలు పడుతున్నారు.

జులై 7న ఎమ్మార్పీఎస్ మహాసభ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బేస్తవారిపేట: ఒంగోలులో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహామేళ మహాసభకు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎమ్మార్పీస్ నియోజకవర్గ కన్వీనర్ బూదాల ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్పీస్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. జులై 7వ తేదీన జరిగే మహాసభకు నాయకులు, కార్యకర్తలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షులు వేశపోగు భరణి, నాయకులు కువ్వారపు జయమ్మ, మీగడ నాగేశ్వరరావు, చల్లగాలి ప్రవీణ్, తోటకూర ప్రసన్న, కువ్వారపు బెంజిలు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై నేతల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ తాడికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు: అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై మండిపడ్డారు. విధులకు కూడా ఇలాగే వెళ్తున్నారా? అని నిలదీశారు. అధికారులు తమ పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఎంపీడీవో దారా హనుమంతురావు మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, బాధ్యత లేనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. ప్రతి పథకం ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం అధికంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యులు యామర్తి ప్రభుదాస్, అనపర్తి పుల్లమ్మ, యోహోన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీలు ఇడమకంటి వెంకటేశ్వర రెడ్డి, మంచాల నాగ ప్రియాంక మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ సంజీవరావు మాట్లాడుతుండా మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకారెడ్డి అన్నారు. తాము సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని తహసీల్దార్ చెప్పడంతో సభలో ఇద్దరి మధ్య వాదనలు జరిగాయి. ఎంపీపీ జోక్యంతో వారి వాదనలు సద్దుమణిగాయి. విఠలాపురం సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నవులూరి విద్యాసాగర్, నవులూరి నరేంద్ర పనికి వెళ్లకుండానే పని దినాలకు మస్టర్లు వేయిస్తున్నారని, వేయకుంటే ఫీల్డ్ అసిస్టెంట్ను బెదిరించి మరీ వారి కుటుంబ సభ్యులకు డబ్బులు అకౌంట్లోకి వచ్చేలా చేస్తున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు.

జీవాల ఎరువుతో పొలానికి భూసారం


సత్తువ కోసం పొలంలో ఉంచిన గొర్రెలు

పెద్దారవీడు: ఏటా వ్యవసాయం భారమవుతోంది. ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రెట్టింపు అవుతున్నాయి. దీంతో రైతులు పాత కాలం పద్ధతులను అవలంభిస్తున్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో లభించే జీవాల ఎరువు వాడి పొలాల్లో భూసారం పెంచుతున్నారు. బీడు భూముల్లో గొర్రెలు, మేకలు మందలను తోలించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నేల సారవంతమైతే ఏ పంటైనా దిగుబడి హెచ్చుగానే ఉంటుంది. దానికి అనుగుణంగా రైతులు సైతం ఎప్పటికప్పుడు భూమిని సారవంతం చేస్తూనే ఉంటారు. జీవాల ఎరువు పంట పొలాలకు వేస్తే పైరు ఏపుగా పెరగడంతో పాటు అధిక దిగుబడి పొందొచ్చని, ఆ దిశగా రైతులు ఆలోచిస్తున్నారు. రైతులు గొర్రెల మందను పొలాల్లో నిలిపి వాటి విసర్జితాలు నేలలో కలిసేలా చర్యలు తీసుకుంటారు. తక్కువ పెట్టుబడితో లభించే జీవాల ఎరువు పొలంలో భూసారం పెంచుతుంది. ఒక్కో మందలోనూ 100 నుంచి 150 గొర్రెలు ఉంటున్నాయి. రాత్రి వేళల్లో పంటలు లేని ఖాళీ పొలాల్లో గొర్రెల మందను ఉంచుతారు. తెల్లవారే సరికి పొలం అంతా గొర్రెల పెంటతో నిండి ఉంటుంది. గొర్రెల మంద చేరిన పొలంలో నాగలితో దుక్కి దున్నడం ద్వారా పొలంలోని మట్టిలో గొర్రెల పెంట కలిసి నేల సారవంతంగా మారుతుంది. గతంలో ప్రతి ఇంటి వద్ద పశువులు ఉండటం.. వాటి నుంచి వచ్చిన పెంటను పొలాల్లో చల్లి పంటలను సాగు చేసేవారు. ప్రస్తుతం పశువుల పోషణ కూడా కష్టతరంగా మారడంతో పశుపోషణపై రైతులు ఆసక్తి చూపించడం లేదు.

నేల సారవంతమవుతుంది



గొర్రెల మందలను పొలంలో రాత్రి వేళల్లో తోలుకోవడం పూర్వ కాలం నుంచి కొనసాగుతోంది. మందలను పొలంలో తోలుకోవడంతో గొర్రెల మంద పెంట నేలల్లో కలిసిదున్నడం వల్ల నేల సారవంతమవుతుంది. ట్రాక్టర్తో దున్నుతున్న సమయంలో మట్టితో కలిసి నేల గుల్లబారుతుంది. ఎరువులు, మందులు ఖర్చులు తగ్గి పంట దిగుబడులు పెరుగుతుంది.

– కాసు వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెద్దారవీడు

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దర్శి (కురిచేడు): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు ఒక ప్రకటనలో కోరారు. దర్శి, వెలుగొండ, అర్ధవీడు, కురిచేడు గురుకులాల్లో 5, 6,7,8,9 తరగతుల్లో ఏర్పడిన ఖాళీలకు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు దర్శి గురుకులంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతిలో ఉన్న ఖాళీలకు ప్రవేశాలకు పరీక్ష రాసిన విద్యార్థులకు ఈ నెల 23న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్శి, వెలుగొండ, అర్ధవీడు బాలుర గురుకులాల్లో జూనియర్ ఇంటర్ ప్రవేశానికి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు 27వ తేదీన కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్లు జరుగుతాయని ఆయన వివరించారు.

మార్క్ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు


నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

రాచర్ల: రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును మార్క్ఫెడ్ అధ్వర్యంలో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గిద్దలూరు ఏడీఏ డీ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని రామాపురం, ఒద్దులవాగుపల్లె గ్రామాల్లో నల్లబర్లీ పొగాకును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద మిగిలిన నల్లబర్లీ పొగాకును మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. దీంతో వీఏఏల ద్వారా సంబంధించిన వివరాలను ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. రైతులు వద్ద మిగిలిపోయిన నల్లబర్లీ పొగాకును ఆ యాప్లో నమోదు చేయించుకోవాలని, ఇది ఒక మంచి అవకాశంగా భావించాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్.మహబుబ్బాషా, వీఏఏ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

యువత పోరును జయప్రదం చేయండి

దర్శి (కురిచేడు): ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతి ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి నెరవేర్చనందుకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 23న ఒంగోలులో యువత పోరు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఒంగోలులోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్కు వినతి పత్రం అందించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు, విద్యార్థి విభాగం నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం యువత పోరు పోస్టర్ను ఆవిష్కరించారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26లో 6,7,8,9 తరగతులకు, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్షకు ఏర్పడిన ఖాళీలను పూరిస్తున్నట్లు వెలుగొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్కే ఇబ్రహీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న గురుకుల పాఠశాల దర్శిలో బాలురకు, బాలికలకు మార్కాపురం గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల ద్వారా వారికి కేటాయించిన రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఇస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు వారికి కావాల్సిన పాఠశాలలో దరఖాస్తులను 23వ తేదీ వరకు సంబంధిత పాశాలలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. 23వ తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించరని ప్రిన్సిపాల్ అన్నారు.

దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దేవస్థానం సమీపంలోని నీటిగుండంలో భక్తులు అధిక సంఖ్యలో తలనీలాలను సమర్పించి, స్వామి వారి దర్శనం చేసుకున్నారు. స్వామి వారి దర్శణం కోసం వచ్చిన భక్తులకు గోపాలకృష్ణ యాదవ, కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశినాయన, యోగివేయన రెడ్ల, అర్యవైశ్య అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.


గ్రామోత్సవంలో కలశాలతో మహిళలు

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ కొలుపులు

కురిచేడు: నాగారపు ఎల్లమ్మ తల్లి కొలుపులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కురిచేడులోని నుసుం బజారులో వేంచేసి ఉన్న నాగారపు ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే జలాధివాసం, అనంతరం ఆడపడుచులతో పుట్ట బంగారం, గ్రామ దేవతలకు మోయన, అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. చాలా కాలం తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ తరం వారికి ఇలాంటి కార్యక్రమాలు కొత్తగా ఉండటంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. గ్రామోత్సవంలో బొల్లావుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకర్షించింది.


పుట్ట వద్ద పూజలు చేస్తున్న ఆడపడుచులు

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి


అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. మొక్కుబడులు ఉన్న భక్తులు నైవేద్యం చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

జీవితంలో యోగా భాగమవ్వాలి


యోగా చేస్తున్న జడ్జిలు, న్యాయవాదులు

దర్శి (కురిచేడు): ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని దర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకరరెడ్డి పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం దర్శి సివిల్, జ్యూడిషియల్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. యోగా ప్రాముఖ్యత గురించి జూనియర్ సివిల్ జడ్జి కె.నిఖిత వివరించారు. యోగా శిక్షకులు గొర్రెపాటి వేణు ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధన చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రేమ్కుమార్, కార్యదర్శి ఎన్.సుబ్బారెడ్డి, కోశాధికారి పి. మనోహరమ్మ, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో..

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా దర్శి ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఎస్సై రఘుసత్యనారాయణ, సిబ్బంది సురేష్, కాశింపీరా, నాగరాజు, ఎస్.శ్రీనివాస్, సాయిబాబాలు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నిత్యం యోగాసనాలు వేస్తే శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతిజ్ఞ చేసి స్టేషన్ ఆవరణలోని అన్ని ప్రదేశాలను పరిశుభ్రం చేశారు. మొక్కలు నాటి పరిసరాల ప్రాముఖ్యత గురించి సిబ్బందికి వివరించారు.


ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ శ్రీనివాసరావు

ఇరుకు గదిలో ఎన్ని కష్టాలో..!

- పదేళ్లుగా నోచుకోని నూతన భవన నిర్మాణం
- పరుల పంచన సమావేశాలు
- ఇబ్బందులు పడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది


చిన్న గదిలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయం


మధ్యలో నిలిచిన సొంత భవన నిర్మాణం


పొదిలి:

సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పశ్చిమ ప్రకాశంలో కీలకంగా పెద్ద ప్రాజెక్ట్ పరిధిలో ఎక్కువ మంది సిబ్బందితో పనిచేస్తోంది పొదిలిలోని కార్యాలయం. కాని ఈ ఐసీడీఎస్ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో పనిచేయడానికి సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐసీడీఎస్కు సంబంధించి సీడీపీవో కార్యాలయం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని చిన్న ఇరుకు గదిలో ఉంది. సొంత భవన నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోవడంతో సమస్యలు చుట్టుముట్టాయి. సౌకర్యాల లేమితో ఉన్న ఆ చిన్నపాటి భవనంలోనే అధికారులు పనులు నిర్వహిస్తున్నారు.

కింద కూర్చొని సమావేశాలు..

పొదిలి సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో, సూపర్వైజర్లు, నలుగురు కార్యాలయ ఉద్యోగులు పనులు చేస్తుంటారు. 145 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 145 మంది ఆయాలతో తరుచూ నిర్వహించే సమావేశాలు పరుల పంచనే ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నారు. కనీసం మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేకపోవటంతో సమావేశాల రోజుల్లో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. పొదిలి నగర పంచాయతీ, రూరల్ మండలం, కొనకనమిట్ల మండలాల నుంచి కార్యాలయానికి పనులపై వచ్చే కార్యకర్తలు, ఆయాలకు కనీసం కూర్చునేందుకు కూడా ఇరుకు భవనంలో అవకాశం లేదు. కంప్యూటర్ టేబుళ్లు, ఇతర సామగ్రికే సరిపోతుంది. సుమారు రూ.50 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణం ప్రారంభించి పదేళ్లు గడుస్తుంది. అధికారులు ఆ భవనం గురించి పట్టించుకోవడం మానివేశారు. ఐసీడీఎస్ కార్యాలయం ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు ఇరుకు భవనంతోనే ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయం భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.


మీటింగ్ రోజుల్లో సమస్యలు..



కార్యకర్తలకు, ఆయాలకు శిక్షణ, అవగాహన తరగతులతో పాటు, నెలవారి సమావేశాలు కార్యకర్తలకు నిర్వహిస్తుంటారు. మొత్తం 150 మంది వరకు కార్యకర్తలు, సూపర్వైజర్లు పాల్గొంటారు. కూర్చోనేందుకు కూడా చోటు ఉండటం లేదు. సిబ్బంది కిందనే కూర్చోవాల్సి వస్తుంది. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవటంతో సమస్యలు ఎదుర్కొంటున్నాం.

ఎం.శోభారాణి, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు

నూతన భవన నిర్మాణం పూర్తిచేయాలి..



చిన్న పాటి భవనంలో సూపర్వైజర్లు కంప్యూటర్ సామగ్రి ఉండటానికి ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలు జరిగే రోజుల్లో కార్యకర్తల బాధలు వర్ణనాతీతం. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఏదైనా సామగ్రి నిల్వ చేస్తే, కిందనే సమావేశాలు జరుపుతుంటారు. సమస్యలు గమనించి, అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– దొండ్లేరు శోభ, ఐసీడీఎస్ సిబ్బంది

నారుమడులు దృఢంగా ఉండాలి

కొమరోలు: షెడ్నెట్ నర్సరీలల్లో పెంచే నారుమడులు దృఢంగా ఉండాలని ఉద్యానవన విశ్వవిద్యాలయ సీనియర్ శాస్త్రవేత్త రవీంద్రబాబు తెలిపారు. మండలంలోని దద్దవాడ రైతు సేవా కేంద్రంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శనివారం షెడ్నెట్ నర్సరీ యజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త రవీంద్రబాబు మాట్లాడుతూ వర్షాకాలంలో నారుకుళ్లు రావడం, ఆకుల మీద మచ్చలు రావడం, చీడపీడల బెడద ఎక్కువగా ఉంటాయన్నారు. మొలకల శాతం తక్కువగా వస్తాయని, తగు జాగ్రత్తలు తీసుకోవడం వలన నారు దృఢంగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ మాట్లాడుతూ నర్సరీ నడుపుతున్న ప్రతి ఒక్క యజమాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నర్సరీలో నాణ్యత గల ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు ఉత్పత్తి చేయాలని తెలిపారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించని నర్సరీ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి సాయిశ్వేత, విస్తరణ అధికారులు, పట్టుపరిశ్రమ సహాయకులు పాల్గొన్నారు.